తెలంగాణ శాసనసభ
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

TELTEL/2016/68867
తెలంగాణ శాసనసభ
TELANGANA SHASANA SABHA
తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 211 | ఎడిటర్ పాలగోని రాజేష్ | 16 గురువారం జనవరి 2025 | పేజీలు 8 వెల 4

## బిఆర్ఎస్ కాదు..
# బిఆర్ఎస్ఎస్

### గులాబీ పార్టీపై రేవంత్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,జనవరి15( : బీఆర్ఎస్ కాదని, అది బీఆర్ఎస్ఎస్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్ ప్రారంభోత్సవానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో బీజేపీ కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తే.. తెలంగాణలో బీఆర్ఎస్ అదే ఫాలో అవుతోందని విమర్శించారు. ఆ పార్టీ తమకు నేర్పించాల్సిన అవసరం లేదన్నారు. తమ ప్రభుత్వం చట్ట ప్రకారం ముందుకెళుతోందని చెప్పారు. తెలంగాణలో ఎక్కడ శాంతిభద్రతల సమస్య ఎదురైనా అక్కడ పోలీసులు ఉంటారని చెప్పారు. తమకు పక్షపాత ధోరణి లేదని కుండబద్దలు కొట్టారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసులపైనా దాడులు జరిగాయని అన్నారు. బీజేపీ జూటా మాటలు చెప్పే పార్టీ అని విమర్శించారు. బీజేపీ నేతల వ్యాఖ్యలపై ఫోకస్ పెట్టాల్సిన అవసరం లేదన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ స్వాతంత్ర్య విషయంలో మోహన్ భగవత్ వెంట ఉంటారా..? లేక దేశం కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర్య సమర యోధుల పక్షాన నిలుస్తారా..? అన్నది తేల్చాలని సీఎం డిమాండ్ చేశారు. 140 ఏండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సొంత భవనం కల సాకారమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏ స్వార్థం లేకుండా దళితులు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పనిచేస్తోందని అన్నారు. నిన్న గాక మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలతో పాటు బీజేపీ సైతం సొంత కార్యాలయ భవనాలను సమకూర్చుకున్నాయని చెప్పారు. ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు ఏవిధంగా ఉన్నాయో చూడాలని అన్నారు. దేశ భవిష్యత్తు కోసం ప్రణాళికా రచన ఈ ఆఫీసు నుంచే జరగబోతోందని చెప్పారు.



## కెటిఆర్‌కు సుప్రీంలో
# చుక్కెదురు

### క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన ధర్మాసనం
### మరోమారు నోటీసులు ఇవ్వనున్న ఎసిబి

న్యూఢిల్లీ,జనవరి15( : మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించిన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది.

2





# నౌకాదళం మరింత బలోపేతం

### అత్యాధునిక ఆస్త్రాల జోడింపు- యుద్ధనౌకలను జాతికి అంకితం చేసిన మోడీ

ముంబయి,జనవరి15
భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో మూడు అస్త్రాలు చేరాయి. అధునాతన యుద్ధ నౌకలు, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను బుధవారం నౌకాదళంలో చేర్చుకున్నారు. ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరై.. యుద్ధ నౌకలను జాతికి అంకితం చేశారు. వీటి రాకతో నౌకదళ బలం మరింత పటిష్టం కానుంది. ఆయుధ తయారీ, సముద్ర భద్రతలో అగ్రగామి కావాలని ముందుకుసాగుతున్న భారత్ లక్ష్యసాధనకు ఇది పెద్ద ముందడుగుగా నిలిచింది.

2

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి నోటీసులు



2

## తిరుగు ప్రయాణంలో
# నగరవాసులు

### టోల్ గేట్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

హైదరాబాద్,జనవరి15 :
సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సొంతూళ్లకు వెళ్లిన హైదరాబాద్ వాసులు తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. యాదాద్రి జిల్లా పరిధిలోని పంతంగి టోల్ఎ÷-లాజా వద్దకు భారీగా వాహనాలు చేరుకుంటున్నాయి. పంతంగి టోల్ఎ÷-లాజాలోని 12 టోల్‌బూత్‌ల ద్వారా ఏపీ నుంచి తెలంగాణ వైపు వాహనాలను అనుమతిస్తున్నారు. కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఏపీ వ్యాప్తంగా ప్రయాణ ప్రాంగణాల్లోనూ రద్దీ పెరుగుతోంది. సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగుపయనమవడంతో విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో రద్దీ ఒక్కసారిగా పెరిగింది. రద్దీని దృష్టిలో పెట్టుకొని పలు ప్రాంతాలకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తదితర ప్రాంతాలకు 116 అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అదనపు బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని.. సాధారణ ఛార్జీలే వసూల చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ తెలిపింది.



## కేంద్రమంత్రులతో
# మంత్రి శ్రీధర్ బాబు భేటీ

### సెమీ కండక్టర్ల ఉత్పత్తిపై అశ్వినీ వైష్ణవ్‌తో చర్చ

న్యూఢిల్లీ,జనవరి15 :
ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రులతో భేటీ అయ్యారు. పలు అంశాలపై వారితో చర్చించారు. సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో తెలంగాణకు సహకరించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కేంద్రం కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు.. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ప్రత్యేకంగా కలిశారు. తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీకి ముందుకొచ్చే పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర అంశాలను కేంద్ర మంత్రికి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. పలు ప్రముఖ సంస్థలు తెలంగాణలో తమ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తాయని, ఇలాంటి తరుణంలో డేటా భద్రత కీలకంగా మారిందన్నారు. అందుకే 'నేషనల్ డిజాస్టర్ రికవరీ జోన్' ఏర్పాటు చేయాల్సి ఉందని ఈ అంశంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 24న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని కోరారు. ఇకపోతే మరో కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కూడా మంత్రి కలిశారు. పలు అంశాలపై ఇద్దరు చర్చించారు.



## ఎన్నికల అఫిడవిట్ కేసులో
## వాదనలు ఎదుర్కోవాల్సిందే

### కూనంనేని క్వాష్ పిటిషన్ కొట్టివేసిన సుప్రీం



న్యూఢిల్లీ,జనవరి15
కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ నాయకుడు కూనంనేని సాంబశివరావుకు సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. తనపై దాఖలు అయిన పిటిషన్‌ను కొట్టి వేయాలంటూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# కెటిఆర్‌కు సుప్రీంలో చుక్కెదురు

ఏసీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో కేటీఆర్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఈ నెల 8న ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న వ్లగ్గ÷ ధర్మాసనం విచారణ జరిపింది. దీంతో ఆయనకు ఇక ఎసిబి విచారణ తప్పదు. అలాగే అరెస్ట్ చేయడం కూడా ఖాయమని అంటున్నారు. రాజకీయ కారణాలతోనే కేసు నమోదు చేశారని.. ప్రస్తుతం కేటీఆర్ విపక్షంలో ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది సుందరం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉండటంతోనే కేసులు పెడుతున్నారని వాదించారు. అయితే.. ప్రతిపక్ష నేతగా ఉంటే కేసులు ఎదుర్కోవాలి కదా..? అని జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రశ్నించారు. హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. పిటిషన్ వెనక్కి తీసుకుని.. మళ్లీ హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇవ్వాలని కేటీఆర్ తరఫు న్యాయవాది కోరారు. పిటిషన్ విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించిన ధర్మాసనం.. మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛ ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారణలో భాగంగా కేటీఆర్ తరఫున న్యాయవాది సిదార్థ వాదనలు వినిపించారు. ఈ ఫార్ములా కారు రేసు కేసులో హెచ్ఎండీఏను, ఇతరులను పేర్కొనలేదని కేవలం ఇద్దరు అధికారులను, కేటీఆర్‌ను మాత్రమే నిందితులుగా చేర్చారని కోర్టు ముందు ప్రస్తావించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు కేసు అని.. కేటీఆర్ ఒక్క రూపాయి తీసుకున్నారని ఎవరూ చెప్పడం లేదని న్యాయవాది తెలిపారు. ఇలాంటప్పుడు అవినీతి నిరోధక చట్టంలోని 13(1)ఏ ఎలా వర్తిస్తుందని.. ఇందులో పీసీ యాక్ట్ 13(1ఎ) వర్తించనే వర్తించదని కేటీఆర్ తరపు న్యాయవాది వాదించారు. వెంటనే జోక్యం చేసుకున్న జస్టిస్ బేలా త్రివేది.. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎలాంటి జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. దీంతో ఈ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టులో కాస్త ఊరట లభిస్తుందని భావించిన కేటీఆర్‌కు ఎదురుదెబ్బే తగిలింది. సుప్రీం నిర్ణయంతో ఈ కేసులో ఏసీబీకి మరింత దూకుడు పెంచే అవకాశం ఉంది. అయితే కేటీఆర్ కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం కూడా సుప్రీంలో కేవియట్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఒకవేళ కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే.. విచారణ సందర్భంగా ముందు తమ వాదనలు వినాలని తెలంగాణ ప్రభుత్వం కేవియట్ పిటిషన్‌ను ముందస్తుగానే దాఖలు చేసింది. హైకోర్టులో క్వాష్ పిటిషన్ నిరాకరణకు గురైనప్పటికీ.. సుప్రీం స్టే విధిస్తుందని కేటీఆర్ భావించినట్లు తెలుస్తోంది. కానీ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌లో తాము జోక్యం చేసుకునేది లేదని సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పడంతో ఏసీబీ మరోసారి నోటీసులు ఇస్తే ఆ విచారణకు కేటీఆర్ ఖచ్చితంగా హాజరుకావాల్సి ఉంటుంది. గతంలో ఈ కేసుకు సంబంధించి కేటీఆర్‌ను దాదాపు ఎనిమిది గంటల పాటు ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ అయిన నేపథ్యంలో.. మాజీ మంత్రి అరెస్ట్ తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌తో పాటు, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్‌ను ఈడీ, ఏసీబీ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. వీరి నుంచి పలు కీలక సమాచారాన్ని ఏసీబీ, ఈడీ అధికారులు రాబట్టినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఏసీబీ సిద్ధమైంది. ఆయనతోపాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు మరో సారి నోటీసులు ఇచ్చే యోచనలో ఉంది. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కావడంతో నోటీసులపై ఏసీబీ ముందుకెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ముగ్గురిని ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి నోటీసులు

హైదరాబాద్,జనవరి15

భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కరీంనగర్ కోర్టుకు హాజరుకావాల్సి ఉందని, విచారణకు ఈనెల 17న హాజరవుతానని కౌశిక్‌రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ విధులు అడ్డుకోవడం, బెదిరింపుల వ్యవహారంలో ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ ఫిర్యాదు మేరకు గతంలో కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌ను దర్యాప్తు అధికారిగా డీసీపీ విజయ్‌కుమార్ నియమించారు.

# నౌకాదళం మరింత బలోపేతం


ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'దేశ రక్షణలో సైనికుల సేవలు ఎనలేనివి. దేశ భద్రత కోసం వారు ప్రాణాలను సైతం లెక్క చేయరు. నౌకాదళం బలోపేతానికి నేడు మరో ముందడుగు పడింది. తొలిసారిగా.. రెండు యుద్ధ నౌకలు, జలాంతర్గామిని ఒకేసారి మనం ప్రారంభించుకున్నాం. ఇవన్నీ భారత్‌లో తయారైనవే. వీటితో నౌకాదళానికి నూతన బలం, దార్శనికత అందుతుంది' అని వివరించారు. 'సముద్ర తీర రక్షణకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. గత పదేళ్లలో 33 యుద్ధ నౌకలు, ఏడు జలాంతర్గాములు నేవీలో చేరాయి. రక్షణరంగ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నాం. దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.25 లక్షల కోట్లు దాటింది. మన రక్షణ పరికరాలను 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, ఉగ్రవాదం నుంచి సముద్రతీరాలను రక్షించడంలో మనం ప్రపంచ భాగస్వామిగా మారాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు.ఐఎన్ఎస్ సూరత్.. పీ15బీ గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేస్తున్న నాలుగో యుద్ధనౌక. ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డిస్ట్రాయర్ యుద్ధ నౌకల్లో ఇదొకటి. ఇందులో స్వదేశీ వాటా 75 శాతం. ఈ యుద్ధ నౌకలో అధునాతన ఆయుధ-సెన్సర్ వ్యవస్థలు ఉన్నాయి. నెట్‌వర్క్ సెంట్రిక్ సామర్థ్యం దీని సొంతం.ఐఎన్ఎస్ నీలగిరి.. పీ17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక. శత్రువును ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞానంతో దీన్ని తయారుచేశారు. ఐఎన్ఎస్ వాఘ్‌షీర్.. పీ75 కింద రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి. ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారు.

# గెలుపు కోసం జింకలా పరుగెడుతున్న అతిషి

## -మరోమారు నోరు జారిగిన బిజెపి అభ్యర్థి రమేశ్ బిధూరి

న్యూఢిల్లీ,జనవరి15

: దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ క్రమంలో దిల్లీ సీఎం ఆతిశీపై భాజపా సీనియర్ నేత, మాజీ ఎంపీ రమేశ్ బిధూడీ తాజాగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. నాలుగేళ్లుగా దిల్లీ సమస్యలను పట్టించుకోని ఆతిశీ.. ఎన్నికలు సమీపించిన వేళ ఓట్ల కోసం నగర వ్యాప్తంగా జింకలా పరుగెడుతున్నారని అన్నారు.'దిల్లీ ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. నగర వీధుల పరిస్థితి చూడండి. గడిచిన నాలుగేళ్లలో ఆతిశీ ఎప్పుడూ ఈ సమస్యలను పట్టించుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ అడవిలో జింకలా దిల్లీ వీధుల్లో ఆమె తిరుగుతున్నారు' అని రమేశ్ బిధూడీ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆతిశీ ఇంటిపేరు మార్చుకుందని గతవారం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే.మరోవైపు, రాజకీయ ప్రత్యర్థులపై వివాదాస్పద ప్రకటనలు చేయడం బిధూడీకి ఇదేం మొదటిసారి కాదు. బీఎస్పీ నేత డానిష్ అలీని దూషించడం మొదలు.. ప్రియాంకా గాంధీ వంటి నేతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై పార్టీ అధిష్ఠానం ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వార్తలు కూడా వచ్చాయి. మరోవైపు భాజపా తరఫున దిల్లీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిధూడీ ఉండనున్నారనే ప్రచారం జరిగింది. అయితే, వీటిని తోసిపుచ్చిన ఆయన.. సీఎం అభ్యర్థి రేసులో తాను లేనని స్పష్టం చేశారు.



# చంద్రబాబుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట

## గత ప్రభుత్వ..బెయిల్ రద్దు పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ,జనవరి15

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బేలా త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసులో ఇప్పటికే చార్జిషీట్ ౯÷ల్ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని జస్టిస్ బేలా త్రివేది వెల్లడించారు. 2023 నవంబర్‌లో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్‌ను రద్దు చేయాలంటూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ వేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఈరోజు ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీం కోర్టు సూచించింది. అయితే ఈ కేసులో ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని జర్నలిస్టు ఇంప్లీడ్ పిటిషన్ వేయగా.. దాన్ని కొట్టివేస్తూ జర్నలిస్టుపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'అసలు ఈ కేసుకు మీకు సంబంధం ఏంటి... మీరెందుకు ఇందులో జోక్యం చేసుకున్నారు' అంటూ జర్నలిస్టును కోర్టు మందలించింది. స్కిల్ కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీం కోర్టు సమర్థించింది. ఆ బెయిల్‌ను రద్దు చేసేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. కాగా.. ఏపీ స్కిల్ కేసుకు సంబంధించి గత ప్రభుత్వం మాజీ సీఎం హోదాలో ఉన్న చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించి జైలుకు కూడా పంపించిన విషయం తెలిసిందే. ఆనాటి నుంచి కేసు విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి గతంలో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ గత వైసీపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సుప్రీంలో వాదనలు జరుగాయి. స్కిల్ కేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరిగిందని అప్పటి
సర్కార్ పేర్కొనలేదు. కావాలని కుట్ర పూరితంగా రాజకీయ కక్షలో భాగంగా చంద్రబాబుపై అవినీతి కేసును మోపింది. అక్రమ కేసును పెట్టి మరీ చంద్రబాబును జైలుకు తరలించారు. ఇదే పిటిషన్‌ను విచారణ జరిపిన ఏపీ హైకోర్టు.. నాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంలో గత వైసీపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను తాజాగా సుప్రీం కోర్టు కొట్టివేసింది.

# ఎన్నికల అఫిడవిట్ కేసులో వాదనలు ఎదుర్కోవాల్సిందే

ఈ నేపథ్యంలో కూనంనేని సాంబశివరావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ఎన్నికల అఫిడవిట్ కేసులో వాదనలు ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలంటూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరాకు జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2023 ఏడాది చివరిలో జరిగాయి. సమయంలో ఫారం 26 ఎన్నికల అఫిడవిట్‌లో సమగ్ర వివరాలు వెల్లడించలేదంటూ కొత్తగూడెంకు చెందిన నందూలాల్ అగర్వాల్ ఆరోపించారుర. ఆ క్రమంలో కూనంనేని ఎన్నికను సవాల్ చేస్తూ.. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిట్నరింగ్ అధికారికి సమర్పించిన ఫారం 26 అఫిడవిట్‌లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన కూనంనేని సాంబశివరావు.. తన భార్య పేరు పేర్కొనలేదన్నారు. అలాగే లైసెన్స్‌డ్ నోటరీతో అఫిడవిట్ రూపొందించలేదంటూ తన దాఖలు చేసిన పిటిషన్‌లో నందూలాల్ అగర్వాల్ స్పష్టం చేశారు. అయితే నందూలాల్ వేసిన పిటిషన్‌ను క్వాష్ చేయాలంటూ తొలుత తెలంగాణ హైకోర్టును ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆశ్రయించారు. కానీ నందులాల్ పిటిషన్‌ను క్వాస్ చేయడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. దీంతో కూనంనేని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ సైతం సుప్రీంకోర్టు తాజా తీర్పుతో కూనంనేని సాంబశివరావుకు గట్టి షాక్ తగిలినట్లు అయింది.

# హామీలు మరచిన ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి

## -నియోజకవర్గంలో విమర్శల జోరు

నిజామాబాద్,జనవరి15 ఆర్మూర్ బీజేపీ పార్టీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి తన నియోజకవర్గం ప్రజల నుంచి తీవ్ర వ్యతికత ఎదురవుతోంది. ఇందులోభాగంగా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు మరచి పోయారని ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆర్మూర్ కి రావద్దంటూ రాకేష్ రెడ్డికి వ్యతిరేకంగా ఆర్మూర్, నందిపేట మండల కేంద్రాల్లో పోస్టర్లు అంటించి నిరసన తెలియజేస్తున్నారు. ంఒ÷ూక్ష ఖీఇంఆ । తెలంగాణ రైతులకు కేంద్రం సంక్రాంతి కానుక.. నిజామాబాద్?లో పసుపు బోర్డుఇక కొందరు స్థానికులు స్పందిస్తూ ఎన్నికల సమయంలో రాకేష్ రెడ్డి రూపాయి వైద్యం, గ్రామానికి 10 ఇళ్ల, యువతకి ఉపాధి అంటూ హామీలు ఇచ్చారని కానీ అధికారంలోకి రాగానే హామీలు మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఏదైనా అవసరం ఉంటే హైదరాబాద్ లోని ఎమ్మెల్యే ఇంటికి రావద్దని చెబుతున్నారని పేదలంటే అంత చులకన భావం ఎందుకంటూ ప్రశిస్తున్నారు.

# రైతుభరోసా తదితర పథకాల అమలు

## 21 నుంచి గ్రామ సభల ద్వారా ఎంపిక

## జిల్లా కలెక్టర్లను ఆదేశించిన సి.ఎస్ శాంతికుమారి

హైదరాబాద్,జనవరి15 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న నాలుగు పథకాలకు సంబంధించిన లబ్దిదారుల జాబితాను ఈనెల 21వ తేదీ నుండి నిర్వహించే గ్రామ సభలలో ఆమోదం పొందాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈనెల 26 వ తేదీన ప్రారంభించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు తగు కార్యాచరణపై జిల్లా కలెక్టర్లతో నేడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ఈ నాలుగు ప్రతిష్టాత్మక పథకాలకు లబ్దిదారుల ఎంపికలో ఏవిధమైన అపోహలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ పథకాలన్నీ నిజమైన అర్హులకే దక్కేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతు భరోసాకు సంబంధించి భూముల వివరాలను రెవిన్యూ శాఖ ద్వారా వ్యవసాయ శాఖకు పంపడం జరిగిందని, సాగుయోగ్యంకానిభూములను క్షేత్ర స్థాయిలో తనిఖీ నిర్వహించాలని అన్నారు. సంయుక్త సందర్శనలు నిర్వహించి, గ్రామసభల్లో వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలు ప్రదర్శించి, చదివి వినిపించి ఆమోదం పొందాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి, ఉపాధిహామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసిన భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాల జాబితాను, గ్రామ సభల్లో ప్రకటించి ఆమోదం పొందాలని సి.ఎస్ తెలిపారు.రేషన్ కార్డుల మంజూరీకై రూపొందించిన లబ్దిదారుల ముసాయిదా జాబితా గ్రామసభల్లో ఆమోదం పొందాలన్నారు. ఇదేవిధంగా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శక సూత్రాల ఆదేశాలకు అనుగుణంగా లబ్దిదారుల ముసాయిదా జాబితా ను గ్రామాలలో ప్రదర్శించాలనిఅన్నారు. గ్రామీణ ప్రాంతాలలో, గ్రామపంచాయతీల వారిగా మరియు పట్టణ ప్రాంతాల్లో వార్డుల వారిగా సభలు నిర్వహించాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో లబ్దిదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, లబ్దిదారుల జాబితా ఎంపిక, డాటా ఎంట్రీ, క్షేత్ర స్థాయి వెరిఫికేషన్ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ను ఆదేశించారు. ప్పటివరకు, ఈ నాలుగు పథకాలకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన, ప్రత్యేక బృందాల ఏర్పాటు, ముసాయిదా జాబితా తయారీ, డేటా ఎంట్రీ ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు చేసిన ప్రత్యేక శ్రద్ధని సి.ఎస్ అభినందించారు. ఈ నాలుగు పథకాల అమలుకై రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అనుగుణంగా అమలయ్యేలా సంబంధిత కార్యదర్శులు పర్యవేక్షించాలని సి.ఎస్. శాంతి కుమారి ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శిడి.ఎస్. చౌహాన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధప్రకాష్, పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసి కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

# నాచారం సురానా వైర్స్ పరిశ్రమలో అగ్నిప్రమాదం తప్పిన ప్రాణాపాయం

హైదరాబాద్,జనవరి15 హైడాబాద్ నాచారం పీఎస్ పరిధిలో అగ్నిప్రమాదం జరిగింది. సురానా వైర్స్ పరిశ్రమలో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అప్రమత్తమైంది. సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుంది. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.ఇటీవల పరిశ్రమల్లో జరుగుతున్న అగ్నిప్రమాదాలతో భారీగా ఆస్తినష్టం సంభవిస్తుండడంతో పాటు ప్రాణనష్టం కూడా అధికంగానే ఉంటుంది. యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోవడం.. భద్రతాప్రమాణాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఇందుకు కారణం. పారిశ్రామిక వాడలు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. ఆయా పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో తెలుగు రాష్ట్రాలతోపాటు బీహార్, గుజరాత్, ఒరిస్సా తదితర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. ముఖ్యంగా పటాన్‌చెరు, జిన్నారం, ఐడీఏ బొల్లారం, కంది, హత్నూర, సదాశివపేట తదితర మండలాల్లో భారీ పరిశ్రమలు ఉన్నాయి. ఈ కంపెనీల్లో తరచూ అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు జరుగుతున్నాయి. దీంతో కార్మికుల భద్రత సవాలుగా మారుతోంది.



## తనదైన శైలిలో పనిచేస్తున్న జిల్లా కలెక్టర్ - ఇలా త్రిపాఠి

గుర్రంపోడు జనవరి 15 (శాసనసభ న్యూస్)
గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఇలా త్రిపాఠి.ముందస్తు అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరు అయిన వైద్య ఆరోగ్య సిబ్బంది.రెగ్యులర్,ప్రభుత్వ ఉద్యోగులను అందరిని విధుల నుండి సస్పెండ్ చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే ప్రతి ఉద్యోగిపై ఇలాంటి చర్యలే.

## మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిని కలిసిన నిట్టు జగదీశ్వర్

-ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బి ఆర్ ఎస్ వి విద్యార్థి సంఘం అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్.



ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 15
సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డిని, తనయుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి)ని బుధవారం ఎలిమినేడు వారి వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిసి అయోధ్య రాముని జ్ఞాపిక అందజేసి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన నిట్టు జగదీశ్వర్.ఈ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అసమర్ధ పాలనపై బి ఆర్ ఎస్ పార్టీ విద్యార్థి సంఘం ముందుకు పోవాలని మంచి రెడ్డి కిషన్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్ కు సూచించారు.

## క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



మంచాల, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 15
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండల కేంద్రంలో మంచాల్ సూపర్ స్టార్స్ సీజన్ -3 క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమంలో పాల్గొని విజేతలకు ప్రథమ , ద్వితీయ బహుమతులను అందజేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. అనంతరం జాపాల్ గ్రామం లో కీ.శే" చేతాళ్ల సంజీవ స్మారక క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొని పోటీల్లో గెలిచిన క్రీడాకారులను అభినందించి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎంతోమంది క్రిడాకారులున్నారని సరైన శిక్షణ లేక వారి ప్రతిభ కనబడటం లేదన్నారు . మంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని రాష్ట్ర స్థాయి , జాతీయ స్థాయిలో ఎదిగేలా సహాయం అందిస్తాం అన్నారు.రాబోయే రోజుల్లో నియోజకవర్గం లో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు , రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు





## అర్హులైన పేదలందరికీ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి

### -ఎంపీడీవో నరేందర్ రెడ్డి -మండల అధికారులతో సమావేశం

### -సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

యాచారం శాసనసభ న్యూస్ ( జనవరి 15):.
ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందేలా చూడాలని, ప్రభుత్వ అధికారుల బాధ్యతని యాచారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల పైన మండల పరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన సమావేశంలో మాట్లాడుతూ... రైతు భరోసా, ఇంద్రమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల పై అధికారులకు అవగాహన కల్పించారు. సర్వే పారదర్శకంగా నిర్వహించాలి అని సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా అధికారులు పనిచేయాలని సమీక్షలో తెలిపారు. సంక్షేమ పథకాలలో అర్హులైన వారికి ఇవ్వాలని, నిర్లక్ష్యం చేయొద్దని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాచారం తహసిల్దార్ అయ్యప్ప, మండల వ్యవసాయ అధికారి రవీంద్రనాథ్, ఏపీవో లింగయ్య, ఏపీఎం సుదర్శన్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, ఎం జి ఎన్ ఆర్ జి ఎస్ సీనియర్ అసిస్టెంట్ లు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానోత్సవం





ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 15
ఇబ్రహీంపట్నం మండలం వెలిమినేడు గ్రామంలో మంగళవారం సాయంత్రం సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి,ఇబ్రహీంపట్నం ఎసిపి కెపివి రాజు పాల్గొని క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన యువకులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏసీపి కేపీవి రాజు మాట్లాడుతూ క్రీడలు వినోదం అందించడమే కాకుండా శారీరక,మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయన్నారు. క్రీడలు ఆడడం వల్ల రక్తపోటు, కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గడం, కండరాల బలం పెరగడం, ఊబకాయం తగ్గుతుందని, అదేవిధంగా మానసిక స్థితి మెరుగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మంఖాల శేఖర్ రెడ్డి, మంచిరెడ్డి వెంకట్ రెడ్డి, యాదగిరి, మహేందర్,వినోద్, పట్నం శివశంకర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన - తోకల వెంకన్న



చండూర్ జనవరి 15 (శాసనసభ న్యూస్):
చండూర్ మండలం గుండ్రపల్లి గ్రామానికి కి చెందిన కురపాటి రామలింగం ఇటీవల మృతి చెందారు. నిరుపేద కుటుంబం బుధవారం రోజు దశదిన కార్యక్రమం అని ఫోన్ లో బిఆర్ఎస్ నాయకులు తెలియజేయగా తక్షణ సాయంగా 50 కిలోల బియ్యం అందజేసిన చండూరు మాజీ ఎమ్ పీ పీ తోకల వెంకన్న. ఈ కార్యక్రమం లో తర్రి సురేష్ బొల్లం రమా శంకర్, ఇరిగి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## బట్టుగూడెంలో ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం

### - దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్

చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 15
సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని చింతపల్లి మండల పరిధిలోని వింజమూరు గ్రామ పంచాయతీ పరిధిలోగల బట్టుగూడెం గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఉదయం నుండి స్వామి వారికి అభిషేకాలు, స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా వేలాది మంది భక్తుల నడుమ వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బాలునాయక్ దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూదైవ సంకల్పంతో ఏ పని అయినా నిర్విఘ్నంగా నిర్వహించవచ్చునని స్వామివారి కృపతో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుని కోరారు.ఈ కార్యక్రమంలో డి. సంజీవరెడ్డి,అలివేలు, నాయిని మాధవరెడ్డి, ఎండి. సిరాజ్ ఖాన్, మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంగి రేకులు నాగభూషణం, రవి నాయక్, ఎస్ శత్రజ్ఞ రాజు, ముచ్చర్ల యాదగిరి, రాజేష్, శ్రీనివాస్, వి. శకృనాయక్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

### -విజేతలకు బహుమతుల ప్రధానం -మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య భాష






యాచారం శాసనసభ న్యూస్ (జనవరి 15):.
మండల పరిధిలో నజ్జిక్ సింగారం లో బీజీవైఎం అసెంబ్లీ కన్వీనర్ వన్నవాడ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆడపడుచులకు ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య భాష హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... పండుగలు సంస్కృతి సాంప్రదాయాలకు, ప్రజలు ఆరోగ్యకరంగా , ఆనందంగా ఉండాలని , ప్రజలకు మేలు జరిగే విధంగా పండుగలు చేసుకోవాలని కోరారు. కానీ సంక్రాంతి పండుగ వేడుకలను ఆడపడుచులు రంగురంగుల ముగ్గులు చూడముచ్చటగా చూడాలనిపిస్తున్నదని అన్నారు. ముగ్గుల పోటీల్లో చాలామంది పాల్గొన్నారు. అందులో గెలుపొందిన విజేతలకు మాజీ ఎంపీపీ సుకన్య చేతల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు వన్నవాడ లక్ష్మారెడ్డి, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## హెూమంతాలపల్లిలో ఘనంగా పలహారపు బండ్ల ఊరేగింపు

### -పెరుమాళ్ళకు ప్రత్యేక పూజలు, మొక్కలు చెల్లింపు.

చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 15
చింతపల్లి మండలం హెూమంతాలపల్లి గ్రామంలో ప్రతి సంక్రాంతి పర్వదినం సందర్భంగా సుమారు 120 సంవత్సరాలనుండి కొనసాగుతున్న ఫలహారపు బండ్ల ఊరేగింపు ఆనవాయితీగా వస్తుంది.ఈ ఏడాది కూడా సాంప్రదాయ బద్దంగా ఉత్సవాలు కొనసాగాయి. సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం గ్రామస్థులు ఉపవాస దీక్షలతో ఎడ్ల బండ్లను అలకరించి, సాంప్రదాయంగా వస్త్రాలు ధరించి గ్రామ పురావిధులలో డప్పు చప్పుళ్ల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహహించారు. ఈ సందర్బంగా గ్రామంలోని పెరుమాళ్ళ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకుని గుడి చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు చుట్టూ ప్రక్కల గ్రామాలతో పాటు మాడ్గుల, దేవరకొండ మండలాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై పలహార బండ్ల ఊరేగింపు తిలకించారు. ఎలాంటి అవాచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చింతపల్లి ఎస్సై యాదయ్య భారీ బందోబస్తు నిర్వహహించారు.



# క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

**-ఓడిపోయిన క్రీడాకారులు గెలుపు వరకు పోరాడాలి -గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం**

**-మొదటి బహుమతి 10,116 రు”-ద్వితీయ బహుమతి 5116 రు”**

**-చింతపట్ల గ్రామ పెద్దల సహకారం అభినందనీయం**

**-మా ఊరి మా బడి అధ్యక్షుడు మహమ్మద్ సాబెర్**

**యాచారం శాసనసభ న్యూస్ (జనవరి 15):**. మండల పరిధిలో చింతపట్ల లో సంక్రాంతి సందర్భంగా మా ఊరు మా బడి అధ్యక్షుడు సాబేర్ ఆధ్వర్యంలో క్రికెట్ క్రీడా పోటీలు బుధవారం ముగిసింది. అనంతరం.. చింతపట్ల గ్రామంలో ని గ్రామ పెద్దలు పిఎసిఎస్ మాజీ చైర్మన్ లిక్కి శ్రీనివాస్ రెడ్డి, అచ్చన్న నరసింహ, కాకులారం జగన్, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, ఏనుగుల మధుకర్ రెడ్డి, సిద్ధ గొని గణేష్, కోతి మధుకర్ రెడ్డి, వస్పరి శ్రీనివాస్, జోగుసత్యం కు మా ఊరు మా బడి అధ్యక్షుడు సాబేర్, ఉపాధ్యక్షుడు సిద్ధగోని శంకర్, 2004 -05 బ్యాచ్కు చెందిన సభ్యులు శాలువాతో సన్మానించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. పోటీలో గెలుపొందిన మొదటి విజేత వారియర్స్ జట్టుకు 10,116 రు”ద్వితీయ బహుమతి టైగర్స్ జట్టుకు 5116 రు” బహుమతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సుమారు 4 సంవత్సరాల నుండి క్రీడలు, ముగ్గుల పోటీలు ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని వాటిని స్ఫూర్తితో తీసుకోవాలని గ్రామ పార్టీ నేతలు మాట్లాడారు. ఓడిపోయిన క్రీడాకారులు నిరుత్సాహంతో చెందకుండా గెలుపు వరకు పోరాడాలని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీర దృఢత్వం ఆరోగ్యానికి లభిస్తుందని తెలియజేశారు. గ్రామాలలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం వలన యువకులు చెడు



వ్యసనాలకు పాల్పడకుండా ఉంటారని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. యువకులు ఆటలే కాదు. సమాజానికి తోడ్పడాలని సూచించారు. ప్రతి ఒక్కరు విద్య, ఉద్యోగం, ఉపాధి వైపు అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల యాదగిరి, మహమ్మద్ జాని, లింగంపల్లి గిరి, మాదరగొని



సుధాకర్, మహమ్మద్ జాంగిర్, సత్యం, శివ, కుమార్, రమేష్, నరేష్, రఘు, సూరం పురుషోత్తం రెడ్డి, పెండ్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాల ఆవరణలో కోడి పందాలు

కాకినాడ,జనవరి15 :

ప్రభుత్వ విద్యాలయాల ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు, పేకాట, గుండాట నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా తుని రూరల్ ప్రాంతమైన వెలమ కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఉంది. సంక్రాంతికి ముందు జూదం వద్దు.. సంప్రదాయ క్రీడలు ముద్దు అనే నినాదంతో పోలీసులు క్రీడా పోటీలు నిర్వహించారు. అదే ఆవరణంలో మళ్లీ కోడిపందాలు నిర్వహించడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారము అంతా తుని రూరల్ పోలీస్ స్టేషన్ కు అతి సమీపంలో జరుగుతున్నప్పటికీ పోలీసులు అటువైపు కన్నీరు చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మంగళవారం ఉప్పరగూడెంలో కోడిపందాల్లో ఇరు వర్గాల మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు కొట్లాటకు దారి తీయడంతో పోలీసుల లాఠీ చార్జి చేసి వారిని చెదరగొట్టారు. ఆ గ్రామంలో రాత్రంతా పోలీస్ ఫిట్టింగ్ ఏర్పాటు చేశారు. తుని పట్టణంలో పలు ప్రాంతాల్లోనూ పలు గ్రామాల్లోనూ కోడిపందాలు నిర్వహించారు.

## హెల్మెట్ లేకుండా పెట్రోల్ పోసేందుకు నిరాకరణ

**పోల్ ఎక్కి కరెంట్ కట్ చేసిన విద్యుత్ లైన్‌మెన్**

**ఫిర్యాదుతో చర్యలు తీసుకున్న విద్యుత్ శాఖ**

న్యూఢిల్లీ,జనవరి15

దిల్లీలోని ఓ ప్రెట్రోల్ బంక్ సిబ్బందికి వింత అనుభవం ఎదురైంది. యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ జిల్లాలోని ఓ పెట్రోల్ బంక్ సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెల్మెట్ లేకపోతే పెట్రోల్ పోయొద్దనే (ఔనీ ఊ।పె।బి, ఔనీ ఖ।బిసనీ) నియమాన్ని పాటిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా విభాగంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ వ్యక్తి పెట్రోల్ కోసం బంక్‌కు వచ్చాడు. అతడు హెల్మెట్ ధరించకపోవడంతో ఇంధనం నింపడానికి అక్కడి సిబ్బంది అంగీకరించలేదు. దాంతో అతడు సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. హెల్మెట్ లేకపోతే ఎవరికీ ఇంధనం ఇవ్వకూడదని జిల్లా మేజిస్ట్రేట్ నుంచి తమకు ఆదేశాలు వచ్చాయని చెప్పినా పట్టించుకోలేదు. ఆగ్రహంతో ఊగిపోతూ ఫ్యూయల్ పంప్‌నకు కరెంట్ సరఫరా అయ్యే స్తంభంపైకి ఎక్కి.. విద్యుత్ సరఫరాను ఆపేసి వెళ్లిపోయాడు. అతడి చర్యలకు ఆశ్చర్యపోయిన సిబ్బంది విద్యుత్ అధికారులను ఆశ్రయించడంతో దాదాపు 20 నిమిషాల తర్వాత వారు కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం బంక్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. లైన్‌మెన్ విద్యుత్ స్తంభం ఎక్కి సరఫరాను నిలిపివేసిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అవడంతో అవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించే ప్రయత్నంలో భాగంగా యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు ఫ్యూయల్ పోయొద్దని పెట్రోల్ బంక్ యజమానులను ఆదేశించింది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు హోర్డింగ్‌లను ఏర్పాటుచేయాలని అధికారులు సూచించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని పెట్రోల్ బంక్‌లలో దీనిని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారు.



## క్రికెట్, ముగ్గుల పోటీలు నిర్వహించిన - టీ ఆర్ ఫౌండేషన్



**చండూర్ జనవరి 15 (శాసనసభ న్యూస్):**
చండూర్ మండలం పరిధిలోని పుల్లెంల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా టి ఆర్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల్లో ప్రథమ బహుమతిగా గెలుపొందిన నవ చైతన్య టీంకి 10,116/- నగదు ,రెండవ బహుమతి రైసింగ్ స్టార్స్ టీంకి 5116/- నగదు,ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిగా గెలుపొందిన పోలే దీపికకి 5116/- నగదు ,రెండవ బహుమతి బొడ్డు అమ్ములుకి 2516/- నగదు,ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులను అందజేసిన పుల్లెంల గ్రామ మాజీ సర్పంచ్ బొబ్బల సంధ్యారాణి, టి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్ రామ్ రెడ్డి(టామ్ రెడ్డి). ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు

# కనుమ వేడుకల్లో పశువులకు పూజలు

## -మటన్, చికెన్ ధరలకు రెక్కలు

అమరావతి,జనవరి15 )

: తెలుగు రాష్ట్రాల్లో కనుమ వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. పాడి పంటలతో పచ్చగా కళకళలాడాలని కోరుకుంటూ అన్నదాతలు గోవులకు పూజలు చేసారు. భోగి, సంకాంత్రిని సందడిగా చేసుకున్న ప్రజలు బుధవారం కనుమ హడావిడిలో ఉన్నారు. మందు, ముక్క వైపు పరుగులు పెట్టారు. దీంతో చికెన్, మటన్ షాపులకు రద్దీ పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో తెల్లవారుజాము నుంచే చికెన్, మటన్ షాపుల వద్ద నాన్ వెజ్ ప్రియులు క్యూ కట్టారు. దీంతో షాపులు పూర్తిగా రద్దీగా మారాయి. చికెన్, మటన్ షాపులతో పాటు పిష్ మార్కెట్స్ కూడా కిటకిటలాడుతున్నాయి. నాటు కోళ్లు, బాయిలర్ కోళ్ల కూడా భారీగా డిమాండ్ పెరిగింది. ప్రధానంగా నాటు కోళ్లను కొనుగోళ్లు చేసేందుకు నాన్ వెజ్ ప్రియులు ఆసక్తి చూపుతున్నారు. కేజీ రూ. 900 చెబుతున్నా కొనుగోళ్లు చేస్తున్నారు. మరోవైపు లైవ్ నాటు కోళ్లను కూడా అమ్ముతున్నారు. బాయిలర్ కోళ్ల మాంసాన్ని కేజీని రూ. 300 వరకూ వ్యాపారులు చెబుతున్నారు. అయినా వెనక్కి తగ్గేది లేదని కొనుగోలు చేస్తున్నారు. కనుమ పండగ సందర్భంగా నాటు కోళ్లు భారీగా అమ్ముడు పోతున్నాయని, దీంతో పూర్తిగా దొరకడం లేదని మాంసం ప్రియులు వాపోతున్నారు. పండగ వేళ చేపలు ధరలు కూడా భారీగా పెరిగాయి. వ్యాపారులు మార్కెట్లో కేజీ రూ. 200 చెబుతున్నారని జనం అంటున్నారు. రేట్లు ఘోరంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీగా వచ్చిన జనాన్ని చూసి పలు చోట్ల ఇప్పటికే హౌస్ ఫుల్ బోర్డు పెట్టేశారు. తాము అంచనా వేసుకుని తెచ్చుకున్న కోళ్లు ఇంత త్వరగా అయిపోతాయని తాము ఊహించలేదని చెబుతున్నారు. తమ వద్ద ఉన్న కోళ్లను అమ్మిన తర్వాత తామూ కూడా కనుమ పండగను ఆనందంగా జరుపుకుంటామని కొందరు షాపుల యజమానులు చెబుతున్నారు. రోవైపు మద్యం ప్రియుల రద్దీ కూడా భారీగా పెరిగింది. చికెన్, మటన్ కాంబోలో ఒక్క చుక్క మద్యం కోసం ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో ఉదయం నుంచే మద్యం షాపులకు వెళుతున్నారు. భారీగా మద్యం షాపుల వద్ద క్యూ కట్టారు. దీంతో మద్యం షాపులు కూడా ఫుల్ రద్దీగా కనిపిస్తున్నాయి. ఈ ఒక్క రోజే భారీగా ఆదాయం వస్తుందని మద్యం షాపుల యజమానులు చెబుతున్నారు.




## డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పిఎన్ఎమ్ మహిళా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడోత్సవాలు

**-విజేతలకు బహుమతులు అందజేసిన ఇబ్రహీంపట్నం ఏసిపి కెవిపి రాజు.**



ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 15
ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో సంక్రాంతి పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని డి వై ఎఫ్ ఐ, ఎస్ఎఫ్ఐ, పిఎన్ ఎం పోల్కంపల్లి గ్రామ మహిళా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ క్రీడోత్సవాలకు విజేతలకు బహుమతులు అందించడానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం ఏసిపి కెవిపి రాజు, గ్రామ పెద్దలు హాజరయ్యారు. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందించి మొదటి బహుమతి ప్రణయ్ గౌడ్, ద్వితీయ బహుమతి కె.శివకుమార్ టీం లకు ఏసిపి కెవిపి రాజు చేతుల మీదుగా పోల్కంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వేదిక మీద బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీబీ రాజు మాట్లాడుతూ సంక్రాంతి పండగ పర్వదిన సందర్భంగా మహిళా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడోత్సవాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని, క్రీడలు వినోదాన్ని అందించడమే కాకుండా శరీర దారుఢ్యం పెరుగుతుందని, యువత చదువుతోపాటు క్రీడల వైపు మొగ్గు చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగరాజు,సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య , మండల కార్యదర్శి బుగ్గ రాములు, జిల్లా కమిటీ సభ్యులు జగన్,జంగయ్య, ఆమనగంటి వెంకటేష్, గ్రామ కార్యదర్శి ఆమనగంటి నరేష్, శాఖ కార్యదర్శి కరుణాకర్ రెడ్డి, యాదయ్య స్వామి, మండల కమిటీ సభ్యులు సిహెచ్ నరసింహ్మ, సభాధ్యక్షుడు మహేందర్, శివ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి గడ్డం గణేష్, జిల్లా అధ్యక్షుడు జంగిలి రాజు, మండల కార్యదర్శి పంది ధనేశ్వర్, గ్రామ కార్యదర్శి వెంకటేష్, పాండు, మహేందర్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## గీత విద్యాలయం మాజీ ప్రధానోపాధ్యాయులు మృతి



చండూర్ జనవరి 15 (శాసనసభ న్యూస్):
చండూర్ గీత విద్యాలయం మాజీ ప్రధానోపాధ్యాయులు వెల్దండ పాపిరెడ్డి బుధవారం రోజు మృతి చెందారు. గీత విద్యాలయం కరెస్పాండెన్స్ పోలోజు నర్సింహ్మా చారి వెల్దండ పాపిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్దండ పాపిరెడ్డి క్రమశిక్షణకు మారుపేరు, స్వయం సేవకులు, మార్గదర్శకులు, ఎందరికో స్ఫూర్తి ప్రదాత, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని అన్నారు. ఈ కార్యక్రమంలో గీత విద్యాలయం కరెస్పాండెన్స్ పోలోజు నర్సింహ్మా చారి వారి తో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం పత్తి మార్కెట్‌లో భారీ అగ్నిప్రమాదం

ఖమ్మం,జనవరి15 రైతుల పండుగ కనుమ వేళ ఖమ్మం పత్తి మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. 15వ తేదీ రాత్రి సమయంలో మార్కెట్ యార్డ్ షెడ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు క్షణాల్లో వ్యాపించడంతో షెడ్‌లో నిల్వచేసిన పత్తి బస్తాలు తగలబడ్డాయి. మంటలు ఉవ్వెత్తున ఎగసిపడటంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని ఫైరిరజన్ల సహయంతో మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. ఈ ఘటనలో దాదాపు మార్కెట్ గోడౌన్?లో నిల్వ ఉంచిన 400 పత్తి బస్తాలు మంటల్లో దగ్ధం అయినట్లు సమాచారం. ఖరీదు చేసిన పత్తి మంటల్లో కాలి పోవడంతో పత్తి వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారాం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి.. అగ్ని ప్రమాదానికి గల కారణం ఏంటన్న దానిపై ఆరా తీస్తున్నారు. అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తి నష్టం ఎంత జరిగిందనేది తెలియాల్సి ఉంది. అగ్ని ప్రమాదం జరగడంతో మార్కెట్?కు వచ్చిన రైతులు భయాందోళనకు గురి అయ్యారు.